అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 318 | వరంగల్ | శుక్రవారం, 25 సెప్టెంబర్ 2026 | పేజీలు: 06



హుస్సేన్‌సాగర్‌లో 69 అడుగుల పంచముఖ మహాగణపతి నిమజ్జనం

జయజయధ్వానాల మధ్య వైభవంగా శోభాయాత్ర

లక్షలాది మంది భక్తుల నడుమ ప్రశాంతంగా ముగిసిన వేడుకలు

బడా గణేశుడికి ఘనమైన వీడ్కోలు



భాగ్యనగరం భక్తిసాగరంగా మారింది. ఎటు చూసినా గణనాథుల కోలాహలం.. జయజయధ్వానాలతో నగరం పులకించింది. శుక్రవారం ఖైరతాబాద్ బడా గణేశుడికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. 69 అడుగుల ఎత్తులో కొలువుదీరిన 'పంచముఖ సంకటహర మహాగణపతి' హుస్సేన్‌సాగర్ గంగమ్మ ఒడికి చేరారు. ఎన్టీఆర్ మార్గ్ వైపు ఉన్న క్రేన్ నంబర్-4 వద్ద భారీ క్రేన్ల సాయంతో మధ్యాహ్నం 2.30 గంటలకు నిమజ్జనం విజయవంతంగా పూర్తయింది. ఉదయం 9.30 గంటలకు ఖైరతాబాద్ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది. గణనాథుడి చివరి రూపాన్ని వీక్షించేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. హుస్సేన్‌సాగర్, ట్యాంక్‌బండ్ పరిసరాలు భక్తజన సందోహంతో కిక్కిరిశాయి. నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరిగేలా హైదరాబాద్ పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. భక్తుల జయజయధ్వానాల మధ్య బడా గణేశుడి నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంతో వేడుకలకు ఘనమైన ముగింపు లభించింది.

- అక్షరశక్తి, హైదరాబాద్

సీఎం రేవంత్‌రెడ్డికి ఆర్యదాన్ ముహమ్మద్

2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు



అక్షరశక్తి, డెస్క్ : కేరళంలోని నిలంబూరులో జరిగిన కార్యక్రమంలో ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్ 2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు'ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఈ అవార్డును ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపి కే.సీ. వేణుగోపాల్ ప్రదానం చేశారు. కేరళ దిగ్గజ కాంగ్రెస్ నేత, దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ అవార్డు అందించారు. రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, దూరదృష్టితో కూడిన నాయకత్వానికిగాను అవార్డుకు సీఎం రేవంత్ రెడ్డిని ఎంపిక చేశారు.

ఆర్టీసీ ఎన్నికల్లో టి.డబ్ల్యూ.యూ యూనియన్‌కు కాంగ్రెస్ మద్దతు



అక్షరశక్తి, హైదరాబాద్ : ఆర్టీసీ గుర్తింపు సంఘం యూనియన్ ఎన్నికల్లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తరఫున తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ కు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ యూనియన్ కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా, జిల్లాలో, నగరంలో, అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆర్టీసీ డిపోలలో కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా ఉన్న తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (TWU) కు పూర్తి సహకారం, సమన్వయాన్ని అందించాలని కోరారు. ఈ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ తరఫున సమన్వయం చేయడానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ను ఇన్‌చార్జిగా నియమించారు.



జర్నలిస్ట్ వనం భాస్కర్‌కు ఘన నివాళి అర్పించిన జర్నలిస్టులు

అక్షరశక్తి, వరంగల్ : అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ వనం భాస్కర్ మృతదేహానికి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, పలువురు జర్నలిస్టులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వనం భాస్కర్ కుటుంబానికి ప్రెస్ క్లబ్ నుండి 25,000 రూపాయలు సాయం అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో కూడా ఆ కుటుంబానికి క్లబ్ నుండి 20వేల ఆర్థిక సాయం అందించారు. భాస్కర్ మృతి దురదృష్టకరమని, వారి కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. నివాళులర్పించిన వారిలో TUWJ(H)143 వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొరుకొప్పుల నరేందర్, TUWJIJU వరంగల్ జిల్లా కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్, ప్రెస్ క్లబ్ ఈసీ సభ్యులు ఎండీ నయీంపాషా, కమటం వేణు గోపాల్, సీనియర్ జర్నలిస్టులు దాసరి శ్రీనివాస్, అడుప మహేష్, జన్ను స్వామి, కందుల శ్రీధర్, పెరుమాండ్ల మధు, బండి రవి, మోహన్, చినబాబు, నీలం శివ, ఉమాశంకర్, పాషా, అక్రం, రాజేశ్, శ్యాం, గంగరాజు, కృష్ణాకర్, సాయి, తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే



అక్షరశక్తి, హన్మకొండ : వర్ధన్నపేట నియోజకవర్గంలోని గ్రేటర్ వరంగల్ పరిధి 2వ డివిజన్ గుండ్లసింగారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన నూతన గృహాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు. రెండో డివిజన్ పరిధిలోని గుండ్లసింగారంలో మాదాసి దయాకర్-సుజాత దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తికావడంతో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్వయంగా వెళ్లి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన ఇంటిని ప్రారంభించి, దయాకర్-సుజాత దంపతులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటిలో వారు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కల ఎంతో ముఖ్యమైనదని, ఆ కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి అర్హులైన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని, నియోజకవర్గంలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ అధ్యక్షులు పుట్ట తిరుపతి,వర్ధన్నపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ గడిపి జీవన్,వంగపహడ్ మాజీ పాక్స్ చైర్మన్ అనిల్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ బోడ డిన్న,డివిజన్ ప్రధాన కార్యదర్శి వంశీ,స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.





యోగా సాధనతో మానసిక వికాసం

హనుమకొండ అదనపు కలెక్టర్ ఎన్. రవి



అక్షరశక్తి,హనుమకొండ: నిరంతరం యోగా సాధన చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం కలుగుతుందని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్, పర్యాటక శాఖ నోడల్ అధికారి ఎన్. రవి అన్నారు. సెప్టెంబర్ 27న నిర్వహించనున్న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ ఎన్. రవి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, యోగా సాధకులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా సాధన చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండటంతో పాటు ఆధునిక జీవనశైలిలో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించుకోవచ్చని తెలిపారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ తెలుసుకొని, నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని సూచించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం శివాజీ మాట్లాడుతూ పర్యాటక దినోత్సవం సందర్భంగా యోగా తో పాటుగా యువ టూరిజం క్లబ్ ల ద్వారా పాఠశాల, కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలు అందిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 27 ఆదివారం నాడు సాయంత్రం పబ్లిక్ గార్డెన్ లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఆయుష్ శాఖ అధికారులు, పర్యాటక శాఖ సిబ్బంది, వాలంటీర్లు, యోగా సాధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజంలోని చివరి వ్యక్తి అభ్యున్నతే లక్ష్యం



అక్షరశక్తి, హనుమకొండ: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయుల జీవితం, ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కాకతీయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రపు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం హనుమకొండ కేడీసీ కళాశాలలోపండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గుర్రపు శ్రీనివాస్ మాట్లాడుతూ మాట్లాడుతూ దేశ సమగ్ర అభివృద్ధితో పాటు సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి దీన్దయాళ్ ఉపాధ్యాయులు విశేష కృషి చేశారని తెలిపారు. ఆయన ప్రతిపాదించిన 'ఏకాత్మ మానవతావాదం', 'అంత్యోదయ' భావనలు సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలనే లక్ష్యాన్ని చాటిచెప్పాయని పేర్కొన్నారు. మై భారత్ ప్రోగ్రాం ఇంచార్జ్ రాజేష్ మాట్లాడుతూ ప్రజా సేవ, దేశ సేవకు ఆయన జీవితం ఆదర్శమని, యువత ఆయన ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. అనంతరం దీన్ దయాల్ జన్మదినాన్ని పురస్కరించుకొని వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేయడం జరిగింది, ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేయడం జరిగింది, ప్రథమ బహుమతి అక్షయ ద్వితీయ బహుమతి భవిత, తృతీయ బహుమతి కార్తీక్ బహుమతులను ప్రధానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాజశేఖర్ ,రజనీ లత ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ గంగిశెట్టి శ్రీనివాస్ ,డాక్టర్ బి సీతారాం ,డాక్టర్ గన్ సింగ్, డాక్టర్ మాలతి, అధ్యాపక బృందం డాక్టర్ వీరన్న, డాక్టర్ రమేష్, డాక్టర్ జీకే కుమార్, విద్యార్థిని ,విద్యార్థులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతపై షీ టీమ్ అవగాహన

అక్షరశక్తి, హసన్‌పర్తి, సెప్టెంబర్ 25: మహిళల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వరంగల్ షీ టీమ్ ఎస్సై స్వాతి అన్నారు. హసన్‌పర్తిలోని సుమతి రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థినులకు సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై స్వాతి మాట్లాడుతూ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, టెలిగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత ఫొటోలు, వివరాలను పంచుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒంటరిగా తెలియని ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు టీసేఫ్ యాప్‌ను వినియోగించుకోవాలన్నారు. ఉద్యోగ ప్రదేశాల్లో అసభ్యంగా ప్రవర్తించే వ్యక్తులు, ఆకతాయిల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అపరిచితులతో వ్యక్తిగత విషయాలు పంచుకోవద్దని సూచించారు. మహిళలపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే వెంటనే షీ టీమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలపై 1930కి ఫిర్యాదు చేయాలని తెలిపారు. షీ టీమ్ వాట్సాప్ నంబర్లకు ఫిర్యాదు చేస్తే వివరాలను గోప్యంగా ఉంచి, నేరస్థులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ రాజశ్రీ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె. మహేందర్ శర్మ, కోఆర్డినేటర్లు శశికుమార్ రెడ్డి, చిరంజీవి, షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

చారిత్రక సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాలి

అక్షరశక్తి,ములుగు: కాకతీయుల శిల్పకళా వైభవం, పచ్చని అడవులు, సెలయేళ్లు, జలపాతాలు, గుట్టలు, వాగులతో ప్రకృతి వర్ణశోభకు ములుగు జిల్లా నిలయంగా ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం వెంకటాపూర్ మండలం పాలంపేట ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం ఆవరణలో వరల్డ్ టూరిజం డే-2026ను పురస్కరించుకొని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బోర్డాడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన హెరిటేజ్ వాక్స్, తెలంగాణ దర్శిని, కాంపిటీషన్స్, కల్చరల్ కార్యక్రమాలను నిర్వహించారు.









ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా మంత్రి దనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు. గొల్లల గుడి నుంచి రామప్ప దేవాలయం వరకు నిర్వహించిన హెరిటేజ్ వాక్‌ను జిల్లా కలెక్టర్ బోర్డాడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ప్రారంభించి కార్యక్రమంలో పాల్గొన్నారు. 2026 వరల్డ్ టూరిజం డేను "డిజిటల్ ఎజెండా అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టు రీడిజైన్ టూరిజం" అనే థీమ్‌తో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు, విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పౌర సంబంధాల శాఖ సంస్కృతిక కళాసారధి కళాకారుల బృందం గేయాలు అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ 13వ శతాబ్దంలో నిర్మితమైన రామప్ప దేవాలయం కాకతీయుల కళా సంపదకు నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ గొప్పతనాన్ని విశ్వవ్యాప్తం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. శతాబ్దాలుగా తర తరాలకు అందుతున్న ఈ అపురూప వారసత్వ సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన ములుగు జిల్లాలో పచ్చని అడవులు, అందమైన చెట్లు, గుట్టలు, సెలయేళ్లు, వాగులు, వన్యప్రాణులతో అపారమైన ప్రకృతి సంపద ఉందన్నారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర, లక్నవరం సరస్సు, బొగత జలపాతం, మల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయం వంటి పర్యాటక ప్రాంతాలు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయని తెలిపారు. చారిత్రక కట్టడాలు, ప్రకృతి సంపదను పూర్వీకులు అందించిన వారసత్వంగానే కాకుండా భావితరాలకు తిరిగి అందించాల్సిన విలువైన ఆస్తిగా భావించాలని మంత్రి సూచించారు. పర్యావరణం, చరిత్ర పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. పర్యాటక రంగంలో ములుగు జిల్లాకు పురస్కారం లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, కాంపిటీషన్స్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. చల్వాయి టీజీఎంఎస్‌కు చెందిన డి. శ్రీజ బృందం ప్రథమ బహుమతి, దేవగిరిపట్నం తెలంగాణ మైనారిటీ బాలికల పాఠశాలకు చెందిన ఆర్. శ్రీవల్లి ద్వితీయ బహుమతి, గోవిందరావుపేట బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్. మనస్విని, ఎ. శ్రుతి, ఎం. పావలి తృతీయ బహుమతి అందుకున్నారు. మరో విభాగంలో గోవిందరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎం.డి. యాస్మిన్ విజేతగా, మంగపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కె. దిలీప్ రన్నరప్‌గా నిలిచారు. తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన రంజిత్, రుత్విక్ ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, టూరిజం నోడల్ అధికారి ధర్మ నాయక్, స్థానిక సర్పంచ్ రాజు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాపురి కాలనీలో ఘనంగా గణేశుడి శోభాయాత్ర

అక్షరశక్తి, నర్సంపేట: ద్వారకాపురి కాలనీ ప్రకాశ్‌రెడ్డిపేటలో గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం వినాయకుడి నిమజ్జన శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. టీఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, గణేష్ నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు డా. బోడ అనిల్ కుమార్ నాయక్ శోభాయాత్రలో పాల్గొన్నారు. మహిళలు, కమిటీ సభ్యులు, పిల్లలు కోలాటాలు, చప్పట్లతో నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్ నాయక్ మాట్లాడుతూ ద్వారకాపురి కాలనీలో రెండో ఏడాది నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆటపాటలతో విజయవంతంగా నిర్వహించారని అన్నారు. కాలనీ కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు పెంపొందించేలా ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు.



వైబ్రేట్ జూనియర్ కళాశాల అధినేత రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా కాలనీలోని కుటుంబ సభ్యులంతా ఏకమై మనోహర్ రెడ్డి అధ్యక్షతన గణపతి ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ద్వారకాపురి కాలనీ ఆదర్శవంతమైన కాలనీగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, విగ్రహ దాత సమ్మిరెడ్డి, ఉపాధ్యక్షుడు హరిబాబు, ట్రెజరర్ వినయ్ భాస్కర్ రెడ్డి, సెక్రటరీ నారా చంద్, జనరల్ సెక్రటరీ సురేష్ రెడ్డి, యాక్టివ్ మెంబర్లు శ్రీను, శంకర్, శ్రీనివాస్, సురేందర్ రెడ్డి, రవి కిరణ్, మల్లికార్జున్, భాస్కర్ రెడ్డి, యాకయ్య, రాజు, సుమన్, చందు, భాస్కర్, సంతోష్, సుజాత, మాధవి, కవిత, రూప, అశ్విని, సరిత, అనూష, సులోచన, కళావతి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో మెడికో పేరెంట్స్ ఆత్మీయ సమ్మేళనం



అక్షరశక్తి,హైదరాబాద్: వైద్య విద్యలో (ఎంబీబీఎస్) సీట్లు సాధించిన నూతన విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించడంతో పాటు, సీనియర్, జూనియర్ విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య పరస్పర సహకారం, అవగాహన పెంపొందించే లక్ష్యంతో మెడికో పేరెంట్స్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లోజుల సత్యనారాయణ చారి తెలిపారు. ఈ నెల 27వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో మెడికో పేరెంట్స్ ఆత్మీయ సమ్మేళనం (సక్సెస్ మీట్) నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. వివిధ ప్రాంతాలు, వైద్య కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఒకరినొకరు పరిచయం చేసుకుని, సమన్వయంతో ముందుకు సాగేందుకు ఈ సమ్మేళనం వేదికగా నిలవనుంది. సీనియర్ విద్యార్థుల తల్లిదండ్రులు జూనియర్ విద్యార్థుల తల్లిదండ్రులకు పుస్తకాలు, విద్యా అంశాలు, కళాశాల వాతావరణం, వసతి తదితర అంశాలపై తమ అనుభవాలను పంచుకోనున్నారు. అదేవిధంగా వైద్య కళాశాలల్లో ర్యాగింగ్ నివారణ, విద్యార్థుల భద్రత, తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులంతా ఒకే మెడికో కుటుంబంగా పరస్పరం అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మెడికో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ 110వ జయంతి



అక్షరశక్తి, హన్మకొండ : పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ 110వ జయంతి సందర్భంగా వారికి కాకతీయ వ్యవసాయదారుల క్రయ విక్రయాల కూరగాయల మార్కెట్ బాలసముద్రంలో బిజెపి జాతీయ కౌన్సిల్ మెంబర్, మాజీ శాసనసభ్యుడు, మార్కెట్ గౌరవ అధ్యక్షుడు మార్తినేని ధర్మారావు అధ్యక్షతన జయంతి కార్యక్రమం నిర్వహించారు. దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్ర పటానికి మార్తినేని ధర్మారావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. తదనంతరం మాట్లాడుతూ... రాష్ట్రీయ స్వయంసేవకు, ఏకాత్మ మానవత వాదం సిద్ధాంతాన్ని ప్రబోధించిన మానవతావాది, అంత్యోదయ పథకం దేశంలోని ప్రతి ఒక్క సగటు మానవునికి లబ్ధి చేరాలని చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు రావుల కిషన్, మిద్దెల బాబు, రావుల సుదర్శన్, నార్లగిరి రామలింగం, న్యాయవాది శేషగిరిరావు, బైరి శ్రవణ్ కుమార్, బీజేపీ జిల్లా కార్యదర్శి పోసగోటి వెంకట్ రావు, గాదె రాంబాబు, బింగి శ్రీనివాస్, ఉడుతలబాబు, గంద్రాతి శ్రీనివాస్, శనిగరము విజయ్ కుమార్, దొంతుల వాసుదేవ్ రెడ్డి, రాపాక వేణు, తక్కలపెల్లి నిఖిల్ రావు, మాదాసు ప్రణయ్ కుమార్, మార్కెట్ సభ్యులు గండి స్వామి, గట్టు రాజమౌళి, చింతల రఘుపతి, చికెన్ రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి నిమజ్జనం

అక్షరశక్తి, హనుమకొండ, సెప్టెంబరు 25: హసన్‌పర్తి గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవస్థానంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ తల్లి, గణపతి ఆశీస్సులతో గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గణపతి నిమజ్జనాన్ని భక్తులు, యువత శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





యాంటీబయాటిక్స్ వాడకంలో బాధ్యత అవసరం

అక్షరశక్తి, హనుమకొండ: వాగ్దేవి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌కు చెందిన వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకతీయ యూనివర్సిటీ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ జి. సమ్మయ్య హాజరై ప్రసంగించారు. యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ ప్రపంచ ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతోందని అన్నారు. వైద్యుల సూచన లేకుండా యాంటీబయాటిక్స్ తీసుకోవడం, మందుల కోర్సును మధ్యలోనే నిలిపివేయడం, వైరల్ వ్యాధులకు యాంటీబయాటిక్స్ వాడటం వంటి కారణాలతో ఔషధ నిరోధకత పెరుగుతోందన్నారు. వైద్యుల సూచన మేరకే మందులు వాడాలని, సూచించిన కోర్సును పూర్తి చేయాలని సూచించారు. చేతుల పరిశుభ్రత, టీకాలు, పారిశుద్ధ్యంతో అనేక ఇన్‌ఫెక్షన్లను నివారించవచ్చన్నారు. ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని, సరైన రోగికి, సరైన ఔషధాన్ని, సరైన మోతాదులో, సరైన సమయంలో అందించడం వారి బాధ్యత అని తెలిపారు. కృత్రిమ మేధస్సు, వ్యక్తిగత వైద్యం, ఫార్మాకోజెనోమిక్స్ వంటి ఆధునిక రంగాల్లో యువ ఫార్మసిస్టులకు విస్తృత అవకాశాలున్నాయని చెప్పారు. మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టడంలోనూ ఫార్మసిస్టులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు యాంటీబయాటిక్స్‌ను బాధ్యతాయుతంగా వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సంస్థల చైర్మన్ డాక్టర్ దేవేందర్ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ వాహిని రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్వతారోహణ శిక్షణకు సాయి చరణ్ ఎంపిక

అక్షరశక్తి, హనుమకొండ, సెప్టెంబరు 25 : లాల్‌బహదూర్ కళాశాల పదో తెలంగాణ బెటాలియన్ ఆర్మీ వింగ్ క్యాడెట్ మోడెం సాయి చరణ్ అరుణాచల్‌ప్రదేశ్‌లోని పశ్చిమ కామెంగ్ జిల్లా దిరాంగ్‌లో జరిగే మౌంటైనింగ్ క్యాంప్‌కు ఎంపికయ్యారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ (నిమాస్) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణకు సాయి చరణ్ శుక్రవారం ఉదయం బయలుదేరారు. సముద్రమట్టానికి 6,000 నుంచి 7,000 అడుగుల ఎత్తులో జరిగే ఈ శిక్షణలో భూమి, గాలి, నీటికి సంబంధించిన సాహస క్రీడల్లో శిక్షణ ఇస్తారు. సాయి చరణ్ ప్రతిభ ఆధారంగా పదో తెలంగాణ బెటాలియన్ అధికారులు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్ రావు తెలిపారు. ఈ సందర్భంగా సాయి చరణ్‌ను కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ భాగ్యనారాయణ, కార్యదర్శి వినయ్‌కుమార్, కెప్టెన్ డాక్టర్ ఎం. సదానందం, అధ్యాపకులు, క్యాడెట్లు అభినందించారు. ఈ నెల 6 వరకు పర్వతారోహణ శిక్షణ కొనసాగనుంది.

కడిపికొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు షూ పంపిణీ



అక్షరశక్తి, కాజీపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి యూనిఫామ్‌తో పాటు బెల్ట్, షూలను కూడా ప్రభుత్వం అందజేస్తోందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చుంచుకాల లింగారావు తెలిపారు. ఇందులో భాగంగా కడిపికొండ హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 50 మంది విద్యార్థులకు ఒక్కొక్క జత షూలు, రెండు జతల సాక్సులను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. షూలు, సాక్సులు అందుకోవడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుదాం

- **పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు**



అక్షరశక్తి, హన్మకొండ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాజంలో కుల వ్యవస్థను పెంచి పోషించడం వలన దేశంలోని దళిత, గిరిజన అట్టడుగు వర్గాల పైన వివక్షత, కుల దురహంకార దాడులు, హత్యలు, స్త్రీలపై అత్యాచారాలు యదేచ్ఛగా పెరిగిపోతున్నాయని పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం హన్మకొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మహాత్మ జ్యోతిబాపూలే స్థాపించిన "సత్యశోధక్ సమాజ్ 153వ ఆవిర్భావ వారోత్సవాల్లో (సెప్టెంబర్ 24 నుండి 30 వరకు) భాగంగా "కుల నిర్మూలన అవగాహన సదస్సుష నిర్వహించారు. ఈ సందర్భంగా బి.నరసింహారావు మాట్లాడుతూ దేశంలో కుల వ్యవస్థను, సామాజిక రుగ్మతలను రూపుమాపడమే ధ్యేయంగా మహాత్మ జ్యోతిబాపూలే "1873 లో సత్యశోధక సమాజ్" ను స్థాపించాడని గుర్తు చేశారు. దేశంలోని విద్యాసంస్థల్లో కుల నిర్మూలన భావజాలాన్ని పెంపొందించే పాఠ్యాంశాలను రూపొందించి అమలు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ప్రపంచంలో శాస్త్ర సాంకేతిక రంగాలు జెట్ స్పీడ్ వేగంతో అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో మాత్రం కుల వ్యవస్థ రూపుమాపబడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో శతాబ్దాలుగా భారతదేశ సమాజాన్ని పట్టిపీడిస్తున్న కుల, మత, ఆర్థిక అసమానతలను రూపుమాపేందుకు విద్యార్థులంతా ఐక్యం కావాలన్నారు. నేటి విద్యార్థి, యువత కుల నిర్మూలన చైతన్యాన్ని పెంపొందించుకోవాలని, లౌకిక, ప్రజాస్వామిక మానవీయ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. భారతదేశంలో కుల నిర్మూలన కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయులు పెరియార్, మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే, అంబేద్కర్ లు కొనసాగించిన పోరాట స్ఫూర్తితో సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ పి. అనూష, జిల్లా నాయకులు కార్తీక్, విష్ణు, రవళి, వంశీ, చందు, వినయ్, స్వాతి, బబ్లు, అక్షిత తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు, దళితులకు భూమి పంపిణీ

సీఎం రేవంత్‌రెడ్డికి దళితనేతల కృతజ్ఞతలు



అక్షరశక్తి, హనుమకొండ, సెప్టెంబర్ 25: అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం, అర్హులైన దళితులకు భూమి పంపిణీ చేయాలనే నిర్ణయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండ అంబేద్కర్ సర్కిల్‌లో కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సీఎం నిర్ణయాన్ని స్వాగతించారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన సంఘాల నాయకులు మాట్లాడుతూ... మాట్లాడుతూ, అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం దళిత కుటుంబాల భూ హక్కులు, ఆత్మగౌరవం, ఆర్థిక భద్రతకు ఎంతో కీలకమని అన్నారు. గత ప్రభుత్వాల కాలంలో వివిధ కారణాలతో దళిత కుటుంబాలకు భూములకు సంబంధించి ఏర్పడిన సమస్యలను సమగ్రంగా సమీక్షించి, అర్హులైన వారికి తిరిగి న్యాయం చేయాలని కోరారు. దళితుల భూములకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా పరిశీలించి, అన్యాయంగా ఇతరుల పేర్లకు మారినట్లు తేలిన భూములను అర్హులైన అసలు హక్కుదారులకు తిరిగి అందించే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేగుంట సునీల్ మాదిగ, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, రాజేందర్, సురేష్, బాబూరావు చుంచు రాజేందర్, మాదాసు సురేష్, మన్నే బాబురావు, రామచందర్, కేడేల ప్రసాద్, స్వామి, మందవీరస్వామి, రవీందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం

- **పనులు పరిశీలించిన సీఎంఓ కార్యాలయ ఉన్నతాధికారులు**





అక్షరశక్తి, వరంగల్: నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రవాణా, రోడ్లు, భవనాల శాఖ వికాస్ రాజ్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, సీఎంఓ కార్యదర్శి కె. మాణిక్ రాజ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు ఆసుపత్రి నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరుగుతున్న నిర్మాణ పనుల ప్రస్తుత స్థితి, వివిధ విభాగాల నిర్మాణం, మౌలిక వసతులు, విద్యుత్, నీటి సరఫరా తదితర అంశాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించి, ఇప్పటివరకు పూర్తయిన పనుల నాణ్యతను, చేపట్టాల్సిన పనులను ప్రణాళికాబద్ధంగా, సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణంలో ప్రతి దశలోనూ నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి అందుబాటులోకి వచ్చిన అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా, పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందేలా అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు.





ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

- అరుణోదయ దప్పుదళం కళాకారులతో విస్తృత ప్రచారం

అక్షరశక్తి, కొత్తగూడ : ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈనెల 28, 29, 30వ తేదీలలో జరుగు అఖిలభారత రైతుకూలి సంఘం (ఏఐకేఎంఎస్) జాతీయ నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఈరోజు కొత్తగూడ సంతలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య దప్పుదళం కామ్రేడ్స్ తో బహిరంగ సభ కరపత్రాలతో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇడంపాక శ్రీశైలం, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు పాల్గొని మాట్లాడుతూ... భారత వ్యవసాయ రంగాన్ని ఛిన్నాభిన్నం చేస్తూ తీవ్ర సంక్షోభంలోకి నెట్టి వేస్తూ స్వేచ్ఛ వాణిజ్యం పేరుతో వ్యవసాయ రంగాన్ని ప్రైవేట్ పరం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. ఈనెల 28, 29, 30 తేదీలలో ఖమ్మం పట్టణంలో జరుగు ఏఐకేఎంఎస్ జాతీయ 4వ మహాసభలను రైతులు, కూలీలు ప్రజలు, ప్రజాస్వామిక వాదులు విద్యార్థి మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూక్య పూర్ణ చందర్ ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షులు, గజ్జి సోమయ్య, మండల ప్రధాన కార్యదర్శి, రాజమల్లు, బుర్కా బుచ్చి రాములు పార్టీ మండల కార్యదర్శి, నిర్మల, రామ్ సింగ్, రామ్ చందర్, జామల, రాజా, భిక్ష, అచ్చు, హేమ్లు,పూలక్క,ప్రభాకర్, నాగేష్, జక్కుల సమ్మయ్య, బంగారు లక్ష్మియ్య, తదితరులు పాల్గొన్నారు.





మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయం

అక్షరశక్తి, హైదరాబాద్, సెప్టెంబరు 25: మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్‌సింగ్ దేశ ఆర్థిక ప్రగతికి దిశానిర్దేశం చేసిన మహోన్నత ఆర్థికవేత్త అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం గచ్చిబౌలిలోని ఐటీ కారిడార్ విప్రో సర్కిల్ వద్ద మన్మోహన్‌సింగ్ కాంస్య విగ్రహావిష్కరణ నేపథ్యంలో ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. 1991లో ఆర్థిక మంత్రిగా ఆయన చేపట్టిన ఆర్థిక సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులకు దోహదపడ్డాయని తెలిపారు. 2004-14 మధ్య ప్రధానమంత్రిగా దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ఆర్థిక స్థిరత్వానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం వంటి కార్యక్రమాలు ఆయన హయాంలో అమలులోకి వచ్చాయని పేర్కొన్నారు. మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ఎంపీగా ఆయన మార్గదర్శకత్వంలో పనిచేసే అవకాశం తనకు లభించడం గర్వకారణమన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలోనూ మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పాత్ర కీలకమని తెలిపారు. గచ్చిబౌలిలో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఆయన సేవలను స్మరించుకోవడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

కేయూ పార్ట్‌టైమ్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజేందర్





అక్షరశక్తి, కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పార్ట్‌టైమ్ లెక్చరర్స్ అసోసియేషన్ (కుప్లా) ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కాకతీయ యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్ష పదవికి డాక్టర్ కె. రాజేందర్, డాక్టర్ కె. సుబాష్ పోటీ చేశారు. మొత్తం 145 మంది ఓటర్లకు గాను 84 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాజేందర్‌కు 64 ఓట్లు, సుబాష్‌కు 20 ఓట్లు లభించడంతో రాజేందర్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఫలితాలను ప్రైసైడింగ్ అధికారి డాక్టర్ ఆదిరెడ్డి ప్రకటించారు.

నూతన కార్యవర్గం:

ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ నాగేశ్వర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ వాణీదేవి, కోశాధికారిగా డాక్టర్ టి. మౌనిక, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ పి. మహేందర్, ఉమెన్ కన్వీనర్‌గా డాక్టర్ భాగ్యమ్మ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. మనోహర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన పార్ట్‌టైమ్ అధ్యాపకులు, ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సహాయ నిర్వహణ కమిటీ సభ్యులకు నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది.

గూడూరు జయశ్రీ కుటుంబానికి
న్యాయం చేయాలి



అక్షరశక్తి, హనుమకొండ, సెప్టెంబరు 25: గూడూరు జయశ్రీ కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. హనుమకొండ రాంనగర్‌కు చెందిన జయశ్రీ తన అత్త మీరాబాయి ఇంట్లో తాళం వేసి బంధించడంతో నాలుగు రోజులుగా నిరసన దీక్ష చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం ప్రజాసంఘాల నాయకులు సంఘటనా స్థలాన్ని సందర్శించి ఆమెకు మద్దతు తెలిపారు. దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్ పటేల్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అంకెశ్వరపు రామచందర్‌రావు మాట్లాడారు. గతంలో మీరాబాయి నోటరీ డాక్యుమెంట్ ద్వారా జయశ్రీకి రాసిచ్చిన ఇల్లు, ఆమెకు రావాల్సిన ఆస్తులను వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. జయశ్రీని ఆమె కుమార్తె తేజస్విని రక్షించాలని, సమస్యపై స్థానిక ఎమ్మెల్యే, పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో కేయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ మంద వీరాస్వామి, మాదిగ ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షుడు మేడ స్వామి మాదిగ, మోరే ఐలయ్య, గోల్కొండ శ్రీనివాస్, శ్రీరాం మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘ స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలి



అక్షరశక్తి, హనుమకొండ, సెప్టెంబరు 25: తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం 50వ స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మధుపాక ఎల్లయ్య పిలుపునిచ్చారు. హనుమకొండ అంబేద్కర్ జంక్షన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 27న హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ మేనేజ్‌మెంట్ హాల్‌లో స్వర్ణోత్సవ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. వరంగల్ జిల్లా పరిధిలోని అన్ని మండలాల నుంచి అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు, అంబేద్కర్‌వాదులు, విద్యావంతులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. 1033/77 నంబర్‌తో ఏర్పాటైన సంఘం ఐదు దశాబ్దాలుగా అంబేద్కర్ ఆశయాల కోసం పనిచేస్తోందన్నారు. సంఘ నిర్మాణం, భవిష్యత్ కోసం పలువురు సభ్యులు చేసిన కృషిని గుర్తు చేశారు. అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బూజుగుండ్ల శ్రీనివాస్, కోశాధికారి మంత్రి చాణక్య, డాక్టర్ నవీన్, పానుగంటి దయాకర్, మాసాని గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనం



అక్షరశక్తి, హైదరాబాద్: నగరంలో గణేశ్ నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బేగంపేట విమానాశ్రయం నుంచి ఏరియల్ వ్యూ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 11 రోజులుగా ఘనంగా నిర్వహించిన గణేశ్ ఉత్సవాల ముగింపు సందర్భంగా ఖైరతాబాద్ బడా గణేశ్, బాలాపూర్ గణేశ్‌తో పాటు జంట నగరాల్లోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల నిమజ్జనం కొనసాగుతోందన్నారు. ఖైరతాబాద్ గణేశ్ నిమజ్జనం మధ్యాహ్నమే పూర్తయిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసి భక్తులు, ఉత్సవ నిర్వాహకులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. డీజీపీ, కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్, పోలీస్ కమిషనర్ తదితర అధికారులు నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రస్తుత పరిస్థితి ప్రశాంతంగా, నియంత్రణలో ఉందన్నారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున నిర్వాహకులు, భక్తులు సహకరించి విగ్రహాల తరలింపును త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఎంజే మార్కెట్, చార్మినార్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడినప్పటికీ, వెంటనే చర్యలు తీసుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నామని తెలిపారు. ఎలాంటి ప్రమాదాలు, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని మంత్రి కోరారు.


GUEST COLUMN

అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో అన్నదాత స్థానమెక్కడ?



- గౌని ఐలయ్య,
ఏఐకేఎంఎస్
తెలంగాణ రాష్ట్ర
ప్రధాన కార్యదర్శి
సెల్:9490700955

భారతదేశం ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, 200 సంవత్సరాలు మన దేశాన్ని వలసగా పాలించిన బ్రిటన్ ను కూడా దాటి ముందుకు పోయామని ప్రధాని, కేంద్ర మంత్రులు గొప్పగా చెపుతున్నారు. 2047 నాటికి మన దేశాన్ని ప్రపంచంలోనే శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టడం కోసం 'వికసిత్ భారత్' లక్ష్యంతో పనిచేస్తున్నామని, అందులో వ్యవసాయ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని కూడా చెప్తున్నారు. దేశ జనాభాలో సగం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుండడం, గ్రామీణ ప్రాంతాల్లో ఆ సంఖ్య 70 శాతానికి పైగా ఉండడం,రూపొందించుకున్న రాజ్యాంగం ప్రకారం ఐదు సంవత్సరాలకోసారి ఎన్నికలు జరిపి ప్రభుత్వాలని ఎన్నుకోవాల్సి వున్న కారణంగా వ్యవసాయ రంగం గురించి, రైతు కూలీల అభివృద్ధి గురించి అందరూ మాట్లాడక తప్పటం లేదు. స్వాతంత్ర్యం పొందిన కాలం నుండి వ్యవసాయ అభివృద్ధి, రైతాంగ అభివృద్ధి అనే మాటలు మాట్లాడని నేతలు లేరు, ప్రణాళికలు వేయని ప్రభుత్వాలు లేవు. స్వాతంత్రం వచ్చిన గత 80 సంవత్సరాల నుండి అమలు చేస్తున్న ఈ ప్రణాళికలు, పథకాలు అన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి తప్ప రైతు కూలీల నిజ జీవితాలలో మార్పులు తీసుకురాలేదు. ప్రపంచీకరణ విధానాలు, ప్రధానంగా ప్రపంచ వాణిజ్య సంస్థ(WTO) లో భారతదేశం భాగస్వామిగా చేరడం, వ్యవసాయ రంగాన్ని కూడా అందులో చేర్చడానికి అంగీకరించడం మన మెడకు ఉరి తాడుగా మారింది. అప్పటినుండి రైతు కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యల బారిన పడటం పెరుగుతూనే వుంది. 1995 నుండి 2018 మధ్యకాలంలో సుమారు నాలుగు లక్షల మంది రైతుకూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దుస్థితి మరింత పెరిగింది. ఒక్క 2023 సంవత్సరంలోనే 10700 మంది రైతు కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రమాదకరంగా మారిన రైతు కూలీల దుస్థితికి ఇది అద్దం పడుతుంది. నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేస్తామని, స్వామినాథన్ సిఫారసులకు అనుగుణంగా పంటలకు మద్దతు ధర ఇస్తామని హామీ ఇచ్చింది. వాటిని అమలు చేయకపోగా రైతు కూలీలకు నష్టకరమైన కార్పొరేట్ అనుకూల వ్యవసాయ విధానాలను ముందుకు తెచ్చింది. కరోనాకాలంలో తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు రైతుల కోపాగ్నికి కారణమయ్యాయి. ఢిల్లీ కేంద్రంగా రైతాంగం సంవత్సర కాలానికి పైగా సాగించిన సమరశీల పోరాటం ఫలితంగా మోడీ ప్రభుత్వం ఆ చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి, కనీస మద్దతు ధర చట్టం కోసం ఒక కమిటీని వేసింది. ఐదు సంవత్సరాలు గడిచినా అది ఇసుమంత కూడా ముందుకు సాగలేదు. పైగా మరో రూపంలో వాటిని తీసుకురావడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. అందులో భాగంగానే డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్, నేషనల్ పాలసీ ఫ్రేమ్ వర్క్ ఆన్ అగ్రికల్చర్




మార్కెట్, జాతీయ సహకార విధానం పేరుతో కార్పొరేట్ అనుకూల చట్టాలను తీసుకువచ్చింది. రైతులకు తీవ్ర నష్టం కలిగించి కార్పొరేట్ శక్తులకు లాభం కలిగించేందుకు ఇప్పుడు నూతన విద్యుత్ బిల్లు, విత్తన బిల్లులను సిద్ధం చేసింది. ఇప్పటికే విత్తన రంగంలో 100% విదేశీ పెట్టబడులను అనుమతిస్తూ ఇప్పుడు విత్తనాలపై బహుళ జాతి సంస్థల ఆధిపత్యాన్ని సుస్థిరం చేయడానికి విత్తన బిల్లులో అవకాశం కల్పించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించటంతో పాటు వ్యవసాయ రంగానికి, ఇతర పేద వర్గాలకు ఇస్తున్న ఉచిత విద్యుత్ పథకాలకు మంగళం పాడేందుకు డిస్కంల ఏర్పాటును,విద్యుత్ బిల్లును ముందుకు తెస్తున్నారు.అటవీ సంరక్షణ నియమాలు కూడా ఆదివాసి రైతుకూలీలకు, వారి హక్కులకు భంగం కలిగించేవే. ఒకవైపు రైతు కూలీల కనీస హక్కులు, సబ్సిడీలను రద్దు చేస్తూ వ్యవసాయ రంగంలో కార్పొరేట్ల చొరబాటుకు బాటలు వేస్తూ దానినే వ్యవసాయ రంగ అభివృద్ధిగా చెపుతున్నారు. ఇప్పటికే భారత రైతాంగం రుణభారంతో కునారిల్లుతున్నారు. 52 శాతం వ్యవసాయ కుటుంబాలు అప్పుల్లో ఉన్నాయని గణాంకాలు తెలియజేస్తున్నాయి. వారిని అప్పుల ఊబి నుండి బయట పడవేయడానికి ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు శూన్యం. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు 20 లక్షల కోట్లకు పైగా కార్పొరేట్ కంపెనీల అప్పులను రద్దు చేసింది. వారికి ప్రతి సంవత్సరం రెండు లక్షల కోట్లకు పైగా పన్ను రాయితీలిస్తుంది.కవలం 5 లక్షల కోట్ల రూపాయలు కేటాయిస్తే దేశంలోని రైతులను అప్పుల భారం నుండి బయటపడేయవచ్చు. కేంద్రం అలాంటి పని చేయకపోగా రాష్ట్రాలు ఎన్నికల హామీలలో భాగంగా అరకొరగా రైతుల రుణమాఫీ పథకాలు ప్రకటిస్తుంటే వాటి వల్ల బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటాయని కేంద్ర మంత్రులు గగ్గోలు పెడుతున్నారు. ఒకవైపు బడా కార్పొరేట్ శక్తులకు భారీ రాయితీలు ఇస్తూ రైతు కూలీలకు మొండి చేయి చూపుతూ కేంద్ర ప్రభుత్వం రైతు కూలీల అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా వుంది.

స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు మనకు మేలు చేస్తాయా?

ఇటీవల కాలంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తోను, యూరోపియన్ దేశాలతోనూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నది. ఈ ఒప్పందాల వల్ల మన రైతులకు లాభం జరుగుతుందని ఊదరగొడుతున్నారు. ప్రపంచంలోనే వ్యవసాయ రంగానికి అత్యధిక సబ్సిడీలు ఇస్తున్న దేశం అమెరికా. అమెరికా రైతు సగటున 464 ఎకరాలలో సేద్యం చేస్తూ సుమారు ఆరు లక్షల రూపాయల సబ్సిడీని ప్రభుత్వం నుండి పొందుతున్నాడు. అమెరికాతో సహా పాశ్చాత్య దేశాలలో 25% నుండి 60 శాతం వరకు ప్రభుత్వ నుండి రాయితీలు పొందుతుండగా మన దేశంలో అది కేవలం 4% మాత్రమే. ఎరువులపై సబ్సిడీని ఎత్తివేస్తూ, వ్యవసాయ రంగానికి బడ్జెట్లో కోతలు విధిస్తూ రైతాంగం నెత్తిపై పెను భారం మోపుతున్న మన ప్రభుత్వం విదేశీ ఉత్పత్తులతో 'స్వేచ్ఛగా' పోటీ పడమంటున్నారు. భారీ సబ్సిడీలతో సేద్యం చేస్తున్న దేశాల ఉత్పత్తులు తక్కువ ధరకే మన మార్కెట్ ను ముంచెత్తుతుంటే వాటితో పోటీ పడమంటున్నారు .ప్రభుత్వానికే ఎదురు సబ్సిడీలు ఇస్తూ అప్పుల ఊబిలో దిగబడి చావలేక, బ్రతకలేక వ్యవసాయం చేస్తున్న మన రైతులకు అది సాధ్యం కానిపని. పైగా అమెరికా లాంటి అగ్ర రాజ్యాల ఆదేశాలకు లొంగి విదేశీ వ్యవసాయ ఉత్పత్తులపై 113% వరకు సుంకాలు వేసే అవకాశం ఉన్నా వాటిని అతి తక్కువ శాతానికి, చివరకు జీరో





సుంకాలకు అనుమతించడం మన రైతులను బలిపీఠంపై ఎక్కించడమే. ఇప్పటికే భారతీయ పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. మనం ఎగుమతులు చేస్తున్న ఆహార వాణిజ్య ఉత్పత్తులను కూడా భారీ స్థాయిలో దిగుమతులు అనుమతించడంతో మన వ్యవసాయ రంగ కోలుకోలేని విధంగా నష్టపోతున్నది. తెగ బలిసిన ఆబోతుల తో బక్క చిక్కిన లేగ దూడలు పోటీ పడలేవు. సామ్రాజ్యవాద దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు వారికే లాభం చేస్తాయి. మన రైతాంగాన్ని అవి మరింత సంక్షోభంలోకి, అప్పుల సుడిగుండంలోకి నెట్టి వేస్తాయి.

మన వ్యవసాయ రంగంలో ప్రధాన పాత్ర పోషించే వ్యవసాయ కూలీలకు, కౌలు రైతులకు ఎలాంటి చట్టబద్ద హక్కులు లేవు. 80 ఏళ్ల స్వతంత్ర భారతంలో రైతు కూలీల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రత్యేకించి నరేంద్ర మోడీ నాయకత్వం లోని ఎన్డీఏ పాలనలో వారి పరిస్థితి మరింతగా క్షీణించింది. ఈ స్థితి నుండి రైతు కూలీలను రక్షించడానికి వ్యవసాయంగాన్ని గట్టెక్కించడానికి తగిన ప్రణాళికలు రూపొందించకపోగా ఒట్టిపోయిన వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టడానికి కంకణం కట్టుకున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం వ్యవసాయరంగ అభివృద్ధికి పాటుపడుతున్నామని చెప్పడం ఉత్తమాట. గంపగుత్తగా జిడిపి పెరిగిందని, బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగిందని ఊదర కొట్టడం కాదు, దేశ జనాభాలో సగ భాగంగా ఉన్న రైతు కూలీలకు దానిలో దక్కిన స్థానమేమిటో చెప్పాలి. ఆకలి సూచీలో దేశం సిగ్గుపడే స్థాయిలో రోజు రోజుకు మన స్థానం దిగజారుతుంది. ఆదివాసీలు, దళితులు, మహిళలు, మైనారిటీలు అభివృద్ధికి నోచుకోకుండా, కనీస హక్కులను కూడా కోల్పోతూ భయం భయంగా బతుకులీడుస్తున్నారు. మరో వైపు అంబానీ, అదానీ లాంటి బడా కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచి పెడుతూ,చివరకు వ్యవసాయరంగాన్ని కూడా వారికి అప్పగించటానికి పూనుకొంటున్నారు.వారు ప్రపంచ కుబేరులను మించి పోతుంటే సంబరపడుతూ,అదే అభివృద్ధని జబ్బలు చరుచుకొంటున్నారు.కొద్దిమంది కార్పొరేట్ శక్తుల అభివృద్ధి మాత్రమే దేశాభివృద్ధి ఎంత మాత్రం కాదు.వారి సంపదను చూపించి ఇండియా బలమైన ఆర్థిక శక్తిగా అవతరించిందని చెప్పటం ఆత్మ వంచన తప్ప వేరుకాదు. తూర్పు వైపుకు వేలు చూపిస్తూ పడమరకు ప్రయాణం చేసే విధానాలు అమలు చేస్తున్నంత కాలం దేశంలో ప్రజల అభివృద్ధి జరగదు. దేశంలోరైతు కూలీల, అట్టడుగు వర్గ ప్రజల కేంద్రంగా అభివృద్ధి జరిగినప్పుడే అది నిజమైన అభివృద్ధి అవుతుంది.

(అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆల్ ఇండియా మహాసభలు సెప్టెంబర్ 28, 29, 30వ తేదీలలో ఖమ్మంలో జరగనున్న సందర్భంగా....)

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.